క్లుప్తంగా

అభ్యసనా సామర్థ్యాలు పెంపొందించుకోవాలి



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు

రేగిడి: విద్యార్థులు అభ్యసనా సామర్థ్యాలు పెంపొందించుకునేలా బోధన చేపట్టాలని ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు సూచించారు. ఆమదాలవలస కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టీఎల్ఎం వినియోగించి పాఠ్యాంశాలు బోధించాలన్నారు. జగనన్న గోరుముద్ద పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో హెచ్ఎం పాలవలస సురేష్‌కుమార్, ఉపాధ్యాయులు రమాదేవి, కె.వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ఈఓపీఆర్‌డీగా సత్యనారాయణ



రేగిడి: మండల పరిషత్ ఈఓ పీఆర్‌డీఓగా ఏవీ సత్యనారాయణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళం జిల్లా మందస గ్రేడ్ -1 పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న ఈయన పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ప్రజా ప్రతినిధులు, అధికారుల సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

వంటగది ప్రారంభం



ప్రారంభించిన వంటగదిలో భోజనాలు చేస్తున్న దృశ్యం

సంతకవిటి: మండలంలోని మందరాడలో షిర్డీ సాయి మందిరం వద్ద నిర్మించిన వంటగదిని బుధవారం ప్రారంభించారు. గ్రామానికి చెందిన వావిలపల్లి రామకృష్ణంనాయుడు తన తల్లిదండ్రుల పేరుమీద వంటగది నిర్మించారు. ప్రతి బుధ, గురువారాల్లో సుమారు 150 మందికి భోజన ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. చిన్నయ్యపేట గ్రామానికి చెందిన రూపిటి జనార్దనరావునాయుడు బుధవారం అన్నదానం నిర్వహించారు.

నేడు ఉచిత నేత్ర వైద్యశిబిరం

వంగర: మండల కేంద్రంలోని వివేక్ మాస్టర్ మైండ్ హైస్కూల్ ఆవరణలో గురువారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు స్పందన స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు సాదెం వెంకటరమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో స్పందన స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి వైద్యులు తనిఖీలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. అవసరమైన వారికి శస్త్రచికిత్సలు నిర్వహిస్తారన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులతో హెచ్ఎం శ్రీధర్, పీఈటీ మురళీకృష్ణ

తెర్లాం: మండలంలోని నందిగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికై నట్లు హెచ్ఎం కోట శ్రీధర్, వ్యాయామోపాధ్యాయుడు మురళీకృష్ణ తెలిపారు. ఇటీవల జరిగిన జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో పాఠశాలకు చెందిన ఎం.రమ్య, ధర్మ, గణేష్, జశ్వంత్ ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. పాఠశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్



ప్రతిభ కనబరిచిన విద్యార్థినులతో హెచ్ఎం, తదితరులు

వంగర: విద్యార్థులు విద్యలో రాణిస్తేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం ముద్దాడ రమణమ్మ తెలిపారు. వారధి ఫౌండేషన్ ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన పాలవలస యామిని, గొట్టాపు గుణ, శివ్వాపు దీప్తిలను బుధవారం ప్రత్యేకంగా అభినందించారు. వారధి ఫౌండేషన్ ముగ్గురు విద్యార్థులకు అందజేసిన రూ. 36 వేల నగదు, ధ్రువీకరణ పత్రాలను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు ఎస్.జయకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రంచన్‌గా పింఛన్లు

వలంటీర్లు, సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి మరీ బుధవారం పింఛన్లు అందజేశారు. గత ప్రభుత్వ హయాంలో పింఛన్ల కోసం కళ్లు కాయలు కాసేలా ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉండేంది. పంచాయతీ కార్యాలయం వద్ద ఉదయం నుంచి సాయంత్రం వరకు వేచి ఉన్నా పింఛన్ అందుతుందో, లేదో చెప్పలేని పరిస్థితి. కాని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక పింఛన్ సొమ్ము పెంచడంతో పాటు వలంటీర్ల ద్వారా ఒకటో తేదీనే ఇంటి వద్దనే అందజేయడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

– బొబ్బిలి/ రాజాం నెట్‌వర్క్



రాజాం సిటీ: కొండంపేటలో పింఛన్ అందిస్తున్న ఇన్‌చార్జ్ కమిషనర్, సచివాలయ సిబ్బంది



రాజాం : బొద్దాంలో లబ్ధిదారునికి ఫించన్ అందిస్తున్న వైస్ ఎంపీపీ నక్క వర్షిణి.



సంతకవిటి: శ్రీహరినాయుడుపేటలో పింఛన్ అందిస్తున్న వలంటీర్



రామభద్రపురం: ఆరికతోటలో పింఛన్లు పంపిణీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ రమామణి



తెర్లాం: తెర్లాంలో దివ్యాంగ పింఛన్ లబ్ధిదారు లక్ష్మితో బయోమెట్రిక్ వేయిస్తున్న వలంటీర్ వంగపండు గౌరీశ్వరి



రేగిడి : పెద్దశిర్లాంలో ఫించన్లు పంపిణీచేస్తున్న వలంటీర్

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా విస్తృత సేవలు

- ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రజలకు విస్తృతంగా సేవలు అందుతున్నాయని రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. అంగన్‌వాడీ ఆయాలుగా ఇటీవల ఎంపికై న అభ్యర్థులకు బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాధ్యతగా విధులు నిర్వహించాలని సూచించారు. ప్రజారోగ్యం, మాతా, శిశు మరణాలు తగ్గించడమే ఐసీడీఎస్ ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు, వంగర ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, వైఎస్సార్‌సీపీ వంగర మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు, రేగిడి వైస్ ఎంపీపీ వావిలపల్లి జగన్మోహనరావు, పైల వెంకటనాయుడు, సీడీపీఓ డాక్టర్ కనకదుర్గ, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



ఆయాలకు నియామకపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

జనం కోసమే జగన్ ధ్యాస..

- మేలు చేసిన ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలి
- పేదలకు, రాజులకు మధ్య యుద్ధంలో పేదలు నెగ్గాలి
- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

రామభద్రపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యాసంతా జనం కోసమేనని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని ఆరికతోట గ్రామంలో బుధవారం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. గ్రామస్తులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని నాయకులకు హారతులిచ్చి ఆహ్వానం పలికారు. ఎమెల్యే శంబంగి ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ.. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలన ఎలా ఉందిని అడగగా.. ప్రతి ఒక్కరూ సంతృప్తి వ్యక్తం చేశారు. సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. నాలుగున్నరేళ్లలో చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. మేలు చేసిన ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. ఎన్నిక మ్యానిఫెస్టోలో పేర్కొన్న ప్రతీ పథకాన్ని అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి వస్తున్న ప్రజాధరణను చూసి ప్రతిపక్షాలు ఓర్వలేక ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. పేదలకు న్యాయం జరగాలంటే మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావాల్సిందేనన్నారు. భవిష్యత్‌లో మరిన్ని పథకాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగన్‌ను ప్రజలు మళ్లీ దీవించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, బొబ్బిలి ఎంపీపీ ప్రతినిధి శంబంగి వేణుగోపాలనాయుడు, పార్టీ మండల కన్వీనర్ అప్పికొండ లక్ష్మునాయుడు, వైస్ ఎంపీపీలు పెంకి అరుణ, బెల్లాన ప్రసాద్, సర్పంచ్ పెంకి పుష్పమ్మ, పీఏసీఎస్ అధ్యక్షుడు మీసాల ప్రసాదరావు, తహసీల్దార్ ఎ.సులోచనరాణి, ఎంపీడీఓ రమామణి, తదిరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బంద్ విజయవంతం చేయాలి



పోస్టర్‌ను విడుదల చేస్తున్న విద్యార్థి, యువజన సంఘాల నాయకులు

బొబ్బిలి: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అదానీ, అంబానీలకు విక్రయించేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్రపన్నుతోందని వక్తలు అన్నారు. పట్టణంలోని గంటి ప్రసాదం స్మారక భవనంలో బుధవారం విద్యార్థి, యువజన సంఘాలు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించాయి. విశాఖ ఉక్కు కర్మాగారం పోరాటానికి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా ఈ నెల 8న విద్యాసంస్థల బంద్‌ను చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఈ సందర్భంగా రిలీజ్ చేశారు. బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.యుగంధర్, ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ మునకాల శ్రీనివాస్, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట అప్పన్న, డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు ఎ.సురేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బి.రవికుమార్, ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షుడు మణికుమార్, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు, కార్యకర్తలుక పాల్గొన్నారు.

డిసెంబర్ 9 వరకు ఓటు నమోదుకు అవకాశం

బొబ్బిలి: జనవరి 1, 2024 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరూ ఓటు హక్కు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని, ఆఫ్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను బీఎల్‌ఓలు తీసుకొని వాటిని ఆన్‌లైన్‌లో పొందుపరచాలని ఆర్డీఓ ఎ.సాయిశ్రీ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఓటరు నమోదు, మార్పులు చేర్పులు, ముసాయిదా ఓటరు జాబితాల తయారీపై పలు సూచనలు చేశారు. కొత్తగా ఓటు నమోదుకు డిసెంబర్ 9వ వరకు గడువు ఉన్నట్లు చెప్పారు. దీనిపై యువతకు అవగాహన కల్పించాలన్నారు.

స్పందన వినతుల పరిష్కారానికి ప్రాధాన్యం

స్పందనలో అందిన వినతుల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని ఆర్డీఓ సాయిశ్రీ అధికారులకు సూచించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార పంపిణీని తరచూ పర్యవేక్షించాలన్నారు. పిల్లలకు నాణ్యమైన విద్య, ఆహారం అందేలా చూడాలన్నారు. అలాగే రీసర్వే, ఎన్నికల విభాగం విధులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు.

ఘనంగా నందెన్న తిరువీధి

రాజాం సిటీ: పట్టణంలోని కొండపేట బుధవారం నందెన్న దేవుని నిమజ్జన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో తిరువీధి నిర్వహించారు. యువత నృత్యాలతో సందడి చేశారు.

గ్రామాల్లో సంబరాలు..

రేగిడి: మండలంలోని ఖండ్యాం, వెంకటాపురం, కొమెర, తదితర గ్రామాల్లో నందెన్న దేవుని ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారం రోజులు పాటు నందెన్నకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు గ్రామపెద్దలు చెప్పారు.

పాఠశాలలకు వంటపాత్రల పంపిణీ



తెర్లాం: విజయరాంపురం పాఠశాలలో భోజన పథకం నిర్వాహకులకు వంట పాత్రలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ మధుసూదనరావు, ఉపాధ్యాయులు



బాడంగి: స్థానిక హైస్కూల్‌లో వంట ఏజెన్సీ సిబ్బందికి వంటపాత్రలు అందజేస్తున్న జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, తదితరులు

తెర్లాం: ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు పంపిణీ చేస్తున్న వంట పాత్రలను సక్రమంగా వినియోగించుకోవాలని విజయరాంపురం సర్పంచ్ బూరి మధుసూదనరావు అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న జగనన్న గోరుముద్ద పథకానికి సంబంధించి నిర్వాహకులకు ప్రభుత్వం పంపిణీ చేసిన వంట పాత్రలను బుధవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని మరింత మెరుగ్గా అమలవుతోందని, విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన పౌష్టికాహారాన్ని అందిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, వంట నిర్వాహకులు ఉన్నారు.

బాడంగి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం సరఫరా చేసిన వంటపాత్రలను జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, ఎంపీటీసీ దేవరాపల్లి శ్రీను, సర్పంచ్ కండి రమేష్, తదితరులు బుధవారం వంట ఏజెన్సీ సిబ్బందికి పంపిణీ చేశారు. కోడూరు హైస్కుల్‌లో ఎంపీపీ ప్రతినిధి తెంటు మధుసూదనరావు, సర్పంచ్ బోగి జ్యోతి ఏజెన్సీ సిబ్బందికి వంటపాత్రలు పంపిణీ చేశారు. వాటిని సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు.

అమరజీవి చిరస్మరణీయుడు

ఆంధ్రరాష్ట్ర అవతరణకు ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడని పలువురు వక్తలు అన్నారు. బొబ్బిలి, రాజాం నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో బుధవారం ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాముల చిత్రపటానికి అధికారులు, ప్రజాప్రతినిధులు పూలమాలవేసి నివాళులర్పించారు.

– సాక్షి నెట్‌వర్క్



రాజాం సిటీ: అమరజీవి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్, తదితరులు



తెర్లాం: మండల పరిషత్‌లో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ, వైస్ ఎంపీపీ సత్యనారాయణ



బొబ్బిలి: అలజంగి సీబీఎం పాఠశాలలో పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వనమిత్ర అధ్యక్షుడు కృష్ణదాసు, విద్యార్థులు



బాడంగి: మండల పరిషత్ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, ఎంపీడీఓ ఆంజనేయులు, సిబ్బంది

మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

రామభద్రపురం: ప్రజా సంక్షేమంతో పాటు గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ భవనంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అధ్యక్షతన బుధవారం సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి ఎమ్మెల్యే శంబంగి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు ఆయా శాఖల ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. ఎమ్మెల్యే శంబంగి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల మరమ్మతులు, కొత్త కేంద్రాల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, ఆయా పనులు త్వరితగతిన పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పనులు చేపట్టిన గుత్తేదారులకు నెలలోపు బిల్లులు అయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. జగనన్న కాలనీల్లో నిర్మించిన ఇళ్లకు ప్రభుత్వమే ఉచితంగా విద్యుత్ కనెక్షన్ మంజూరు చేస్తుందని, ఈ మేరకు విద్యుత్ శాఖ అధికారులు లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే గ్రామాల్లో పాడైన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త స్తంభాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మండల కేంద్రంలోని కనిమెరక పరిసరాల్లో సామూహిక మరుగుదొడ్లు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తారాపురం, జన్నివలస, బూసాయవలస, రామభద్రపురం మండల కార్యాలయం, రామమందిరం వద్ద బస్సులు ఆపేలా చూడాలని పలువురు సభ్యులు ఆర్టీసీ అధికారులను కోరారు. ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా తగిన చర్యలు తీసుకుంటామని ఆర్టీసీ డిపో ప్రతినిధి కె.ఎం.రావు సమాధానం ఇచ్చారు. అనంతరం 2023–24 సవరణ బడ్జెట్, 2024–25 అంచనా బడ్జెట్‌లను ఎంపీడీఓ రమామణి ప్రవేశపెట్టగా సభ్యులు ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎ.సులోచనరాణి, జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, వైస్ ఎంపీపీలు బెల్లాన ప్రసాదరావు, పెంకి అరుణ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల జీవనోపాధికి భరోసా..

బొబ్బిలి: మత్స్యకారుల జీవన విధానానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం భరోసా కల్పించినట్టుగా గతంలో ఏ ప్రభుత్వమూ కల్పించలేదని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని పక్కి గ్రామంలో మత్స్య శాఖ ఆధ్వర్యంలో నియోజకవర్గానికి కేటాయించిన 4.29లక్షల చేపపిల్లలను చెరువుల్లో విడిచిపెట్టే కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. మత్స్యకార భరోసా పథకం ద్వారా నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఉన్న చెరువుల్లో చేపల పెంపకానికి 4,29,796 చేపపిల్లలను రాష్ట్రప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. వీటి పెంపకంతో మత్స్యకారులు అభివృద్ధి చెందాలన్నారు. మత్స్య సంపద పెంచేందుకు, మత్స్యకారులకు జీవనోపాధి కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మత్స్యకారుల అభివృద్ధికి వలలు, ఐస్ బాక్సులు, ఎలక్ట్రానిక్ వెయింగ్ మెషీన్లను పంపిణీ చేసినట్టు గుర్తు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శంబంగి వేణుగోపాలనాయుడు, ఎంపీపీ శంబంగి లక్ష్మి, జెడ్పీటీసీ సంకిలి శాంతకుమారి, సర్పంచ్ పైడిరాజు, మత్స్యశాఖ సిబ్బంది సంతోష్, సంఘ నాయకుడు వెంకట రమణ, కార్యదర్శి పక్కి మధు, పలువురు మత్స్య కారులు పాల్గొన్నారు.



చేపపిల్లలను చెరువులో విడిచిపెడుతున్న ఎమ్మెల్యే శంబంగి, తదితరులు

జగనన్నను మరోసారి ఆశీర్వదించండి..

- ఎమ్మెల్యే కంబాల జోగులు

సంతకవిటి: కుల మతాలు, పార్టీలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కంబాల జోగులు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని గరికిపాడు గ్రామంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికి వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే ఒక్కో కుటుంబానికి కలిగిన లబ్ధిని తెలియజేస్తూ ముఖ్యమంత్రి సందేశంతో ఉన్న బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాభివృద్ధే ధ్యేయంగా ప్రతి సచివాలయానికీ ముఖ్యమంత్రి రూ. 20 లక్షల చొప్పున మంజూరు చేస్తున్నారన్నారు. ఈ నిధులతో గ్రామంలో ఏమైనా సమస్యలుంటే పరిష్కరించుకోవాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని మేనిఫెస్టోలో చేర్చి అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందని చెప్పారు. జగనన్న పాలనలో ఇంతవరకు అమలైన ఏ ఒక్క పథకంలోనూ అవినీతి జరిగిన దాఖలాలు లేవని స్పష్టం చేశారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శనమన్నారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో మాట్లాడి ఎవరికి ఎటువంటి సమస్యల్లేకుండా చూడాలని ఆదేశించారు. సంక్షేమం కొనసాగాలంటే 2024లో జరగనున్న ఎన్నికల్లో జగన్ మోహన్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు సిరిపురపు జగన్ మోహనరావు, సర్పంచ్ యడ్ల రామకృష్ణ, స్థానిక నాయకులు యడ్ల అప్పలస్వామి, పాగిరి సత్యంనాయుడు, పైల వెంకటనాయుడు, ఎంపీడీఓ రవికుమార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు డోల తిరుపతి, కె.సన్యాసినాయుడు, పి.గణపతి, వి.రమణ, కేవీ నాయుడు, బి.ప్రసాద్, జి.జగన్మోహనరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.



గరికిపాడులో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

సంక్షిప్తంగా...

పౌష్టికాహారంతో ఆరోగ్యం

రేగిడి: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఇస్తున్న పౌష్టికాహారంతో మెరుగైన ఆరోగ్యం చేకూరుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శశికళ అన్నారు. మండలంలోని వెంకమ్మపేటలో వైఎస్సార్ సంపూర్ణ పోషణ, బాలామృతం కిట్లతో పాటు పౌష్టికాహార ప్రదర్శన బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్యామలాకుమారి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

వెంకంపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం



వెంకమ్మపేటలో మెడికల్ కిట్లు అందిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు, తదితరులు

రేగిడి: మండలంలోని వెంకంపేటలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రజల వద్దకే వైద్య సేవలు తీసుకువచ్చిందన్నారు. ఇటువంటి వైద్యశిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు, ఎంపీడీఓ శ్యామలకుమారి, తదితరులు పాల్గొన్నారు.

తూటికాడ కషాయంతో దోమపోటు నివారణ

సంతకవిటి: తూటికాడ కషాయం వరి పంటలో దోమపోటును నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయం ఇన్‌చార్జ్ ఎ.నారాయణమ్మ అన్నారు. మండలంలోని మామిడిపల్లిలో తూటికాడ కషాయం తయారీపై బుధవారం అవగాహన కల్పించారు. 2 కిలోల తూటాకులను దంచి వాటిలో ఐదు లీటర్ల ఆవు మూత్రం, ఐదు లీటర్ల నీరు కలిపి ఉడికించాలన్నారు. వచ్చిన కషాయాన్ని వడబోసి పంటలో పిచికారీ చేయాలని సూచించారు.

నేడు సోమన్నపేట, శాస్త్రులపేటలో గడప గడపకు...

సంతకవిటి: గరికిపాడు సచివాలయ పరిధిలోని సోమన్నపేట, శాస్త్రులపేటల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించనున్నట్లు జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాలకు రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు హాజరవుతారని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ హాజరుకావాలని కోరారు.